వాన.. హైరానా..!


సీతమ్మధార ప్రధాన రహదారిలో కురుస్తున్న వర్షం

సీతమ్మధార: బోరున కురిసిన భారీ వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. నగరంలో ఆదివారం మధ్యాహ్నం నుంచి ఏకధాటిగా వాన కురవడంతో సీతమ్మధారలోని డ్రైనేజీలు, కాలువలు నీట మునిగాయి. రహదారులపై వర్షపు నీటితోపాటు మురుగు నీరు ప్రవహించింది. పాదచారులు, వాహన చోదకులు దాదాపు మూడు గంటల పాటు ఎటూ కదలకుండా షెల్టర్లు వెతుక్కుని ఉండిపోయారు. సీతమ్మధార రైతుబజారు వినియోగదారులు లేక బోసిపోయింది. కూరగాయల విక్రయాలు సాగక.. చిరు వ్యాపారులు నిరుత్సాహానికి గురయ్యారు.

తడిసి ముద్దయిన రహదారులు

మురళీనగర్: మురళీనగర్ పరిసర ప్రాంతాల్లో ఆదివారం కురిసిన వర్షం ప్రజలకు ఎండ వేడిమి నుంచి ఉపశమనం కలిగించింది. మూడు రోజుల నుంచి ఉదయం, సాయంత్రం వర్షం కురుస్తూనే ఉంది. ఆదివారం ఉదయం సూర్యుడు తన ప్రతాపాన్ని చూపాడు. ఎండ వేడిమికి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం 2 గంటల వరకు విపరీతంగా ఎండ ఉంది. ఆ తర్వాత చిరుజల్లులు పడటంతో వాతావరణం చల్లబడింది. వర్షాలకు జాతీయ రహదారిపై వర్షం నీరు నిలిచి ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. వర్షంలో పాదచారులు, వాహన చోదకులు తడిసి ముద్దయ్యారు.


బిర్లా సర్వీస్ రోడ్డుపై నిలిచిన వాన నీరు


సత్యానగర్‌లో వర్షానికి తడిసిన రహదారి

ముగిసిన గరికిపాటి ప్రవచనాలు


సాయిబాబా ఆలయంలో భక్తులతో గరికిపాటి నరసింహారావు దంపతులు


ప్రవచిస్తున్న గరికిపాటి నరసింహారావు

సీతమ్మధార: మహా సహస్రావధాని, పద్మశ్రీ పురస్కార గ్రహీత గరికిపాటి నరసింహారావు ఆధ్యాత్మిక ప్రవచనాల కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. అల్లూరి సీతారామరాజు సమితి ఆధ్వర్యంలో సీతమ్మధార క్షత్రియ కల్యాణ మండపంలో మూడు రోజుల పాటు నిర్వహించారు. పలు ఆధ్యాత్మిక అంశాలపై ఆయన ప్రవచించారు. అనంతరం గరికిపాటి నరసింహారావు దంపతులకు సమితి అధ్యక్షుడు డి.తిరుపతిరాజు, కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్య క్రమంలో చైర్మన్ ఎం.ఎస్.ఎన్. రాజు, సెక్రటరీ డి.ఎస్.పి.వర్మ, కోశాధికారి కె.శ్రీహరిరాజు, జాయింట్ సెక్రటరీ పి.వి.కె.హనుమాన్‌రాజు, ఈసీ మెంబర్లు, విజయ నిర్మాణ్ సంస్థ అధినేత విజయకుమార్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

షిర్డీసాయిని దర్శించుకున్న గరికిపాటి

సీతమ్మధార: మహా సహస్రావధాని, పద్మశ్రీ పురస్కార గ్రహీత గరికిపాటి నరసింహారావు దంపతులు ఆదివారం సాయంత్రం సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని శ్రీమహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయాన్ని సందర్శించారు. వారికి ఆలయ అర్చకులు, ధర్మకర్తలు పూర్ణకుంభం, మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం షిర్డీసాయిబాబాను వారు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గరికిపాటి దంపతులను అర్చకులు సత్కరించారు. ఆలయ చైర్మన్, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది శివప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

11 నుంచి అష్టలక్ష్మీ మహాయాగం

సీతంపేట: అధిక శ్రావణ మాసం సందర్భంగా అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితా పీఠంలో వచ్చే నెల 11 నుంచి 16 వరకు అష్టపద్మ కుండాత్మక అష్టలక్ష్మీ మహాయాగం నిర్వహించనున్నట్లు కుర్తాళ పీఠం ఆస్థాన పండితుడు మాచవోలు రమేష్ శర్మ తెలిపారు. లలితా పీఠంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యాగానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక మాసం విష్ణువు, లక్ష్మీదేవికి అత్యంత ప్రీతిపాత్రమని, అటువంటి మాసంలో జరిగే అష్టలక్ష్మీ యాగంలో పాల్గొన్న వారికి సిరిసంపదలు, అధికార, ధనప్రాప్తి కలుగుతాయన్నారు. భక్తులందరూ ఈ సత్ఫలితాలు పొందేలా లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి ఆశీస్సులతో వచ్చే నెల 11వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు మహా సంకల్పంతో యాగం ప్రారంభమవుతుందని చెప్పారు. 12 నుంచి 15వ తేదీ వరకు ప్రతి రోజూ అష్టలక్ష్మీ యాగం, స్వర్ణ పుష్పార్చన, 16వ తేదీ ఉదయం పూర్ణాహుతి, సాయంత్రం 6 గంటలకు అష్టలక్ష్మీ సమేత నారాయణ కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామన్నారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ మాట్లాడుతూ జగద్గురువు, కుర్తాళం శంకరాచార్య సన్నిధిలో మొట్టమొదటిసారిగా పంచావాహ్నిక అష్టలక్ష్మీ మహాయాగం, తొలిసారిగా అష్టలక్ష్ములతో నారాయణ కల్యాణం జరుగుతాయని వెల్లడించారు. యాగంలో పాల్గొన దలచిన భక్తులు 98492 86779, 89777 88055 నంబర్లలో గాని, పీఠం కార్యాలయంలో గాని సంప్రదించాలని కోరారు. సమావేశంలో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రమేష్‌శర్మ, కృష్ణసేన్

సినీ పరిశ్రమకు కోవిడ్ కొత్త పాఠాలు

సీతంపేట: కోవిడ్ మహమ్మారి సినీ పరిశ్రమతో పాటు ప్రేక్షకులకు కొత్త పాఠాలు నేర్పిందని ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఆర్.పి.పట్నాయక్ అన్నారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక పౌర గ్రంథాలయంలో 'కోవిడ్ తర్వాత ప్రపంచ సినిమా పరిస్థితి' అంశంపై ఆదివారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఇళ్లల్లో కూర్చొని తమకు నచ్చిన సినిమా వీక్షించే అవకాశం కలిగిందన్నారు. ప్రేక్షకులు సినిమాలు చూసే విధానం కూడా మారిందన్నారు. ముఖ్యంగా సినిమా హాళ్లకు వెళ్లే ప్రేక్షకుల సంఖ్య బాగా తగ్గిందని అభిప్రాయపడ్డారు. మన సినిమాలు ఇతర భాషా చిత్రాలతో పోల్చుకునే అవకాశం కలిగిందన్నారు. ఈ సందర్భంగా పలువురు అడిగిన ప్రశ్నలకు ఆర్పీ జవాబులిచ్చారు. ఫిల్మ్ సొసైటీ సభ్యులు పి.ఎస్.మూర్తి పెన్సిల్‌తో గీసిన స్కెచ్‌ను ఆయనకు బహూకరించారు. నరవ ప్రకాశరావు మాట్లాడుతూ పట్నాయక్ సంగీత దర్శకత్వం వహించిన పలు చిత్రాలతో త్వరలో ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎస్.ఎ.డి. పాల్, కాశీ విశ్వేశ్వరరావు, బి.చిన్నారావు, బాబ్జి, కుమారి, అనురాధ, శివన్నారాయణ, చంద్రశేఖర్, రాజీవ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సినీ సంగీత దర్శకుడు ఆర్.పి.పట్నాయక్

అనాథ పిల్లలకు మహిళా వాకర్స్ వితరణ

మురళీనగర్: మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం తల్లిదండ్రుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మధురవాడ మిథిలాపుర వుడా కాలనీలోని అనాథ బాలబాలికల(కృపా సాధన చారిటబుల్ ట్రస్ట్) ఆశ్రమాన్ని సందర్శించారు. క్లబ్ అధ్యక్షురాలు శేషామణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా 50 మంది బాలలను కలుసుకున్నారు. వారికి స్వాతంత్ర్య ఉద్యమ నేతల కథలు చెప్పి వారిలో ఉత్తేజం నింపారు. దాతల ఆర్థిక సాయంతో 200 నోట్ పుస్తకాలు, బిస్కెట్లు, చాక్లెట్లు, గోధుమపిండి నూనె, పంచదార, బియ్యం, అల్పాహారం ఏర్పాటుకు కొంత నగదు ట్రస్ట్ మేనేజర్ ఆ.శంకరరావుకు అందించారు. మహిళా వాకర్స్ క్లబ్ కార్యదర్శి సనపల పుష్ప, పూర్వ అధ్యక్షురాలు కె.మాధవి క్లబ్ సభ్యులు అప్సర్ ఖాన్, సుగుణ పాల్గొన్నారు.


అనాథ బాలలకు పుస్తకాలు అందిస్తున్న మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు

మణిపూర్ ముఖ్యమంత్రి రాజీనామా చేయాలి

కంచరపాలెం: మణిపూర్‌లో ఆదివాసీ మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులు, అత్యాచారాలపై స్పందించని జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రేఖాశర్మ, ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ వెంటనే రాజీనామా చేయాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు జ్ఞానాపురం అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ ఆందోళనలో ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ), భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ), మురికివాడ నివాసీయుల సంక్షేమ సంఘం (ఎంఎస్ఎస్ఎస్), అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య నేతలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జాతీయ కమిటీ సభ్యుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మూడు నెలలుగా మణిపూర్‌లో అల్లర్లు, అత్యాచారాలు, హత్యాకాండలు జరుగుతున్నా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, జాతీయ మహిళా కమిషన్ పట్టించుకోలేదని ఆరోపించారు. మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేసినా స్పందించలేదని వాపోయారు. మత విద్వేషాలను బీజేపీ, ఆర్ఎస్ఎస్ ప్రేరేపిస్తున్నాయని ఆరోపించారు. సుప్రీం కోర్టు స్వయంగా విచారణ చేపట్టి దోషుల్ని కఠినంగా శిక్షించాలని, ఆదివాసీ మహిళలకు రక్షణ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల నేతలు కె. నిర్మల, ఎస్. వెంకటలక్ష్మి, ఇందిర, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


జ్ఞానాపురం అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సంఘాల నాయకులు

క్లుప్తంగా

మంచిగా నడుచుకోండి


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్‌ఐ వెంకటరావు

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ వెంకటరావు మాట్లాడుతూ ఎటువంటి నేరాల జోలికి పోకుండా మంచిగా నడుచుకోవాలని హితవు పలికారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జీవించాలని రౌడీషీటర్లకు సూచించారు. లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. అనంతరం రౌడీషీటర్లను వారి ఇళ్ల వద్దకు పోలీసు సిబ్బంది అప్పగించారు.

గాయనీ గాయకుల సాంస్కృతిక సంస్థ ఏర్పాటు

సీతంపేట: విశాఖ గాయనీ గాయకుల సాంస్కృతిక సంస్థ ఆవిర్భావ కార్యక్రమం ఆదివారం సాయంత్రం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. నగరానికి చెందిన గాయనీ గాయకులతో నూతన సంస్థ ఏర్పాటైంది. ఈ సందర్భంగా సంస్థ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భయ్యా శ్రీనివాస్, కార్యదర్శిగా భూపతి, కోశాధికారిగా ఎం.కృష్ణంరాజు, సంయుక్త కార్యదర్శిగా ఎం.వి.ఆర్.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ఫణిభూషణ్, గౌరవాధ్యక్షులుగా ఫణిస్వామి ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో నూతన కార్యవర్గం


నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

డాబాగార్డెన్స్: రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో 2023–24 ఏడాదికి నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం నగరంలోని ఓ హోటల్లో నిర్వహించారు. రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో క్లబ్ అధ్యక్షుడిగా ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ కె. కిరణ్‌కుమార్, క్లబ్ కార్యదర్శిగా కూటికుప్పల రవికిరణ్ ప్రసాద్‌తో పాటు పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్, రోటరీ జిల్లా పూర్వ గవర్నర్ రోటేరియన్ భాస్కర్‌రామ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న పలువురికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎండాడలో క్లబ్ నిర్వహిస్తున్న మహిళా సాధికారత కేంద్రం, హుకుంపేటలో నిర్వహిస్తున్న గిరిజన మహిళా సాధికారత కేంద్రం ఏర్పాటు చేసిన పూర్వ అధ్యక్షురాలు సునీత లావణ్యను అభినందించారు. కార్యక్రమంలో సునీత లావణ్య, ఎస్. గాయత్రి, మొదిలి మహేష్, మిరియాల వేణు, గోపాల్, డాక్టర్ ఎం. గంగాధర్, పరశురామరాజు, సత్యశ్రీ, పద్మజ, వైవీవీ సత్యనారాయణ, ఎ. కిరణ్, కేవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తీరంలో అలల ఉధృతి


సాగర్‌నగర్ గెడ్డను తాకుతున్న కెరటాలు

కొమ్మాది: తీరంలో అలల తాకిడి ఉధృతంగా ఉంది. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు తీరంలో కెరటాలు పెద్ద ఎత్తున ఎగసి పడుతున్నాయి. ఇప్పటికే మత్స్యకారులు పడవలు, బోట్లు, వలలు, సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఇదిలా ఉండగా సముద్రం భీమిలి జగ్గారావు తోట వద్ద, మంగమారిపేట బేవాచ్ పార్కు వద్ద, సాగర్‌నగర్ బీచ్ గెడ్డ వద్ద ముందుకు వచ్చింది. తీరం కోతకు గురి కావడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

చలసాని ఆశయాలు కొనసాగిద్దాం

సీతంపేట: మార్క్సిజాన్ని సమాజానికి అన్వయించి.. పరిశీలించే దృష్టితో చూసినప్పుడే వాస్తవ పరిస్థితులు అర్థం అవుతాయని నమ్మే వ్యక్తి చలసాని ప్రసాద్ అని విప్లవ రచయితల సంఘం రాష్ట్ర నేత సి.ఎస్.ఆర్ ప్రసాద్ అన్నారు. మార్క్సిస్ట్ మేధావి, విప్లవ రచయిత చలసాని ప్రసాద్ 8వ వర్ధంతి సందర్భంగా 'నేటి రాజకీయాలు సాహిత్యం' అనే అంశంపై శనివారం పౌరగ్రంథాలయంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్క్సిజాన్ని చలసాని ప్రసాద్ ముందుగా జీవితానికి అన్వయించుకుని, ఆ దిశగా కుటుంబ సభ్యులను భాగస్వామ్యం చేశారన్నారు. స్టాలిన్ హింసాకాండపై అనేక మంది విమర్శించినప్పటికీ.. చలసాని మాత్రం స్టాలిన్ చేసిందే సరైందని అన్నారని తెలిపారు. ఆ రోజుల్లో స్టాలిన్ ఆ విధంగా వ్యవహరించకపోతే అమెరికా, జర్మనీ కలిసి సోషలిజాన్ని కూల్చివేసేవారని చలసాని చెప్పేవారన్నారు. బీజేపీ అమలు చేస్తున్న మతతత్వ ఫాసిజాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించేవారని గుర్తు చేశారు. ఉత్తరాంధ్రలో ప్రజా ఉద్యమాలకు తలలో నాలుకగా వ్యవహరించిన కలం యోధుడు చలసాని ఆశయాలను కొనసాగించాలన్నారు. వీక్షణం సంపాదకుడు ఎస్. వేణుగోపాల్ మాట్లాడుతూ బీజేపీ పాలకులు హిట్లర్‌ను ఆదర్శంగా తీసుకుని హిందూమతం పేరుతో కలహాలు సృష్టిస్తున్నారని చలసాని చెప్పేవారన్నారు. ప్రముఖ రచయిత్రి మల్లీశ్వరి 'వర్తమానం చలసాని ప్రాసంగికత'అనే అంశంపై, ప్రముఖ రచయిత ఆచార్య చందు సుబ్బారావు 'చలసాని వ్యక్తిత్వం నిబద్ధత'అనే అంశంపై, మార్క్సిస్టు అధ్యయన కేంద్రం అధ్యక్షుడు జె.వి.సత్యనారాయణమూర్తి 'భారతదేశంలో ప్రజాస్వామ్యం, భవిష్యత్' అనే అంశంపై ప్రసంగించారు. ముందుగా చలసాని చిత్రపటానికి నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులు, ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, జర్నలిస్టు సి.ఎస్.క్షేత్రపాల్ రెడ్డి, చైతన్య మహిళా సంఘం ప్రతినిధి కె.లలిత, పౌరసంఘాల సమన్వయకర్త పి.చంద్రశేఖర్, న్యాయవాది పద్మ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విప్లవ రచయితల సంఘం రాష్ట్ర నేత ప్రసాద్

నేడు 'జగనన్న సురక్ష'

మర్రిపాలెం: జీవీఎంసీ 50వ వార్డులో సోమవారం జగనన్న సురక్ష క్యాంప్ నిర్వహించనున్నట్లు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మాధవధార మాధవ స్వామి కల్యాణ మండపంలో సాయంత్రం 4.30 గంటల నుంచి కార్యక్రమం జరుగుతుందన్నారు. ముఖ్య అతిథి నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు చేతుల మీదుగా లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందిస్తామన్నారు. పార్టీ నాయకులు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులంతా హాజరవ్వాలని ఆయన కోరారు.

53వ వార్డులో..

జీవీఎంసీ 53వ వార్డులో జగనన్న సురక్ష క్యాంప్ నిర్వహించనున్నట్టు కార్పొరేటర్ బర్కత్ అలీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నరేంద్రనగర్ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్లో సోమవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ముఖ్య అతిథి కె.కె.రాజు లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తారని చెప్పారు. పార్టీ వార్డు అధ్యక్షుడు గుజ్జు వెంకటరెడ్డి, జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, తహసీల్దారు, ఏపీడీవో, అధికారులు, పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, గృహసారథులు, కన్వీనర్లు పాల్గొంటారన్నారు.

విద్యతో గౌరవం

కంచరపాలెం: ఏ రంగంలో ఉన్నా.. విద్య అనేది ఉన్నత స్థాయి, గౌరవాన్ని ఇస్తుందని అనకాపల్లి పార్లమెంట్ సభ్యురాలు భీశెట్టి సత్యవతి అన్నారు. కేంద్ర గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం తాటిచెట్లపాలెం ఆశీర్వాద కల్యాణ మండపంలో ఉత్తమ విద్యార్థులకు పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. సంఘ అధ్యక్షుడు బుద్ధ శివాజీ, ప్రధాన కార్యదర్శి ఆడారి లచ్చ అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు ఎంపీ సత్యవతి, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రతీ ఏటా గవర సామాజిక వర్గ విద్యార్థులను ఈ విధంగా ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. గణబాబు మాట్లాడుతూ ప్రపంచంతో పోటీ పడుతున్న నేటి సమాజంలో విద్యకు ప్రధాన ప్రాధాన్యత అవసరమన్నారు. బుద్ధ శివాజీ మాట్లాడుతూ తమ సామాజిక వర్గం విద్య ద్వారా అభివృద్ధి చెంది, ప్రతి విద్యార్థినీ ప్రోత్సహించాలని, ఏటా సుమారు 500 మంది పిల్లలకు ప్రోత్సాహకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ బుద్ధ చంద్రశేఖర్, డాక్టర్ బుద్ధ మురళీసంతోష్, ఆడారి పూరి జగన్నాథం, కాళ్ల రాధిక, కొణతాల వీకే శ్రీనివాసరావు, వేగి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ విద్యార్థికి ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే గణబాబు

అలుపెరగని పోరాటం

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగే వరకు ఉక్కు ఉద్యమం ఆగదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద కొనసాగుతున్న రిలే దీక్షలు ఆదివారం నాటికి 892వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షా శిబిరంలో ఇంటక్ ప్రతినిధులు, కార్మికులు కూర్చున్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమల వల్లే దేశంలో ఆర్థికాభివృద్ధి జరిగిందని, దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వరంగ సంస్థల కేంద్రం పునరాలోచించుకోవాలన్నారు. కార్మిక హక్కులు అమలు కావాలన్నా, నిర్వాసితులకు న్యాయం జరగాలన్నా విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను రక్షించుకోవడం కోసం కార్మిక వర్గం ఎలాంటి త్యాగాలకైనా సిద్ధంగా ఉందన్నారు.

ఎన్‌జీజీవోస్ కాలనీకి కొత్త కార్యవర్గం

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీ రెసిడెంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా వీసం పార్వతీశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా పి.బలరామస్వామి, కార్యదర్శిగా కె.రామచంద్రరాజు, కోశాధికారిగా కేవీఎస్ఎస్ఆర్ గుప్తా, డైరెక్టర్లుగా కర్రి వివేకానంద స్వరూప్, ఎస్.సాంబశివరావు, ఎం.రాజారావు, ఎం.విశ్వస్వరూప్, పి.శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి పి.చిరంజీవులు కొత్త కార్యవర్గాన్ని ప్రకటించారు. 2023 నుంచి 2026 వరకు మూడేళ్ల పాటు కమిటీ కొనసాగుతుంది. గాలిపటం, గంట, ఉదయించే సూర్యుడు, గాజు సింబల్స్‌తో నాలుగు ప్యానల్స్ పోటీలో నిలవగా.. గంట ప్యానల్ నుంచి 11 మంది సభ్యులు పోటీ చేశారు. వీరిలో పది మంది గెలిచారు. నాలుగు ప్యానల్స్ కలిపి 29మంది పోటీలో నిలిచారు. ఉదయించే సూర్యుడు ప్యానల్ నుంచి మెట్ల విశ్వస్వరూప్ డైరెక్టర్ పోస్టుకు ఎన్నికయ్యారు.


ఎన్‌జీజీవోస్ కాలనీ రెసిడెంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

దండాలమ్మా.. బంగారమ్మ


మరిడమ్మ, బంగారమ్మలకు ఉపారం తీసుకెళ్తున్న మహిళలు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 29వ వార్డు దిబ్బలపాలెం, చందకవీధి, పీ అండ్ టీ క్వార్టర్స్ గ్రామదేవత బంగారమ్మ పండగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ చదును పట్టు వద్ద బంగారమ్మకు, మరిడమ్మకు విశేష పూజలు జరిపారు. సాయంత్రం 4 గంటలకు చదును పట్టు వద్ద మరిడమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం దండుబజార్, పీ అండ్ టీ క్వార్టర్స్, చందకవీధి, దిబ్బలపాలెం, జగదాంబ జంక్షన్, ప్రకాశరావుపేట, జడ్జికోర్టు, సింగ్‌హోటల్ జంక్షన్ మీదుగా పితానిదిబ్బలో వెలసిన బంగారమ్మ గుడి వరకు ఊరేగింపుగా వెళ్లి ఉపారం అందజేశారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం తొలేళ్ల సంబరం నిర్వహించనున్నారు.

వేడుకగా సంత్ సమాగం

దాబాగార్డెన్స్: పాతనగరం వాసవీ కల్యాణ మండపంలో ఆదివారం సంత్ నిరంకారీ మండలి ఆధ్వర్యంలో విశాల యువ–బాలల సంత్ సమాగం నిర్వహించారు. మండలి హైదరాబాగ్ జోనల్ హెడ్ క్వార్టర్స్ నుంచి విశాల్ ఖరానా, విశాఖ శాఖ సహ సంయోజకుడు పీవీ రావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 80 మంది యువకులు, బాల బాలికలు పాల్గొని లఘు నాటికలు, బృందగానం, ప్రసంగాలు, కవిత్వాలు నిర్వహించారు. మానవత్వపు గుణాలతో ప్రదర్శించిన లఘు నాటికలు ప్రతినిధులను ఆకర్షించాయి. సద్గురు సత్య సందేశాన్ని మానవాళికి అందించారు. ఈ సందర్భంగా విశాఖ సంత్ నిరంకారీ మండలి సంయోజకుడు ప్రేమ్‌మిర్‌పూరి మాట్లాడుతూ బ్రహ్మజ్ఞానం ద్వారా పరమాత్మను అనుభవపూర్వకంగా తత్వరూపంలో తెలిపారు. మానవ జన్మ లక్ష్యాన్ని నెరవేర్చే ప్రయత్నంపై వివరించారు. నేటి బాలలే భావిపౌరులు కాబట్టి.. చిన్న వయస్సు నుంచే పిల్లల్లో ఆధ్యాత్మిక జాగృతి రావాలని, అందుకు ఇటువంటి కార్యక్రమాలు ముఖ్యమన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల నుంచి నిరంకారీ భక్తులు పాల్గొన్నారు.


సత్య సందేశమిస్తున్న చిన్నారులు

నిందితులను కఠినంగా శిక్షించాలి


జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఐద్వా, సీఐటీయూ నాయకులు

సీతమ్మధార: మణిపూర్ దారుణకాండలో ఇద్దరు మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించటాన్ని ఖండిస్తూ సీఐటీయూ, ఐద్వా ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు తులసీరామ్, ఐద్వా కార్యదర్శి కుమారి మాట్లాడుతూ మణిపూర్‌లో అల్లర్లు జరుగుతూ ఉంటే స్పందించాల్సిన ప్రధాని మోదీ నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని ఖండించారు. నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు. శాంతి భద్రతలను కాపాడాల్సిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా మణిపూర్ పర్యటన తర్వాత అల్లర్లు మరింత పెరిగాయన్నారు. మణిపూర్‌లో హింసకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

జూలో 20 మంది రక్తదానం

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంక్, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఈ శిబిరం ఏర్పాటు చేశారు. జూ సిబ్బంది, సందర్శకులు సుమారు 20 మంది ఈ శిబిరంలో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తదాతలను జూ క్యూరేటర్ నందిని సలారియా అభినందించారు.


రక్తదానం చేస్తున్న సందర్శకులు